# విదేశీ సహాయం



'రావు అండ్ రాజు కంపెనీ ఎక్స్‌పోర్టర్స్' నగరంలో కొత్తగా వెలిసింది.

రెండు లక్షల మూలధనానికి ప్రభుత్వం ఋణంగా యిచ్చిన మరో రెండు లక్షలు కలిపి పెట్టుబడి తయారయింది. ఉద్యోగుల నియమాకం పూర్తి అయింది. సరుకు ఉత్పత్తి, సేకరణ మాత్రమే తరువాయి! అందుకు సన్నాహాలు పూర్తి కాగానే వర్కర్స్‌కి, మిగిలిన సిబ్బందికి జాయిన్ కమ్మని ఉత్తరాలు పోతాయి.

ఈ దశలో రాజుకు ఒక బ్రిలియంట్ ఐడియా వచ్చింది.

'మనం చేయబోయే వ్యాపారంలో విదేశీ సహాయం ఎందుకు తీసుకోకూడదూ...' అని! పరపతికి పరపతీ పెరుగుతుంది- పరపతి సౌకర్యమూ కలుగుతుంది.

వెంటనే అమెరికాలోని ఒక ప్రసిద్ధ సంస్థతో ఉత్తర- ప్రత్యుత్తరాలు ప్రారంభించారు. ఈ ప్రతిపాదనను పరిశీలించడానికి అమెరికా నుంచి ఇద్దరితో ఒక ప్రతినిధి బృందం వచ్చింది హైదరాబాద్‌కి.

సుదీర్ఘ చర్చల అనంతరం- ఏయే రంగాలలో, ఏయే మేరకు, ఏ రూపంలో సహాయం అందించడానికి వీలుందో స్థూలంగా ఒక అవగాహనకి వచ్చారు.

ఇది అయిన తర్వాత ఒప్పందం మీద సంతకాలు పెట్టడానికి రాజు అమెరికా వెళ్లాడు. కూలంకషంగా చర్చించిన తర్వాత యాభైవేల డాలర్ల ప్రాథమిక సహాయం చేయడానికి ఒక ఒప్పందం కుదిరింది.

విదేశీ సహాయం లభించిన ఆనందంతో రాజు ఇండియాకి తిరిగివచ్చాడు.

వ్యవహారం జయప్రదంగా పూర్తి అయినందుకు సంతోషంగా పెద్దల్ని పిల్చి ఘనంగా పార్టీ ఇచ్చాడు.

అంతా అయ్యాక రావు, రాజు తీరిగ్గా కూర్చుని కంపెనీ లెక్కలు చూసుకోసాగారు.

విదేశీ సహాయం వచ్చేది యాభై వేల డాలర్లు. అంటే.. సుమారు నాలుగున్నర లక్షలు! అమెరికన్ ప్రతినిధుల రాకపోక ఖర్చులు, ఇతర ఖర్చులు, పార్టీ ఖర్చులు కలిసి సుమారు లక్షరూపాయలు. రాజు వెళ్లి రావడానికి అయిన ఖర్చులు యాభై వేలు. ఇంక మిగిలింది మూడు లక్షలు. ఇందులో గవర్నమెంట్‌కి తీర్చవలసింది రెండు లక్షలు. ఇంక మిగిలింది ఏమిటి?

ఇదికాక- అటు గవర్నమెంటుకీ, ఇటు అమెరికా సంస్థకి తీర్చవలసిన వడ్డీ! పైగా... సిబ్బందికి నెలనెలా జీతాలు, కంపెనీ అద్దె వగైరా. ఇవన్నీ కంపెనీ మూలధనాన్ని తినేసేటటువంటివి.

ఇంక విదేశీ ఋణం తీరేదెట్లా?

పరిస్థితి చూసేసరికి కళ్లు బైర్లుకమ్మి చేతులు తల మీదకి పోయాయి- రావు అండ్ రాజులకీ!

– జయశ్రీ మాస పత్రిక... జూన్ ' 86